# 1987 దీపావళి మినీ కథల పోటీలో రు. 75/- గెలుపొందిన రచన




**ఆఫీస్‌లోకి అడుగుపెట్టగానే పిల్లిని చూసి కలుగుల్లోకి దూరిపోయే ఎలుకల్లా గుమాస్తాలందరూ ఎవరి సీట్ల లోకి వాళ్ళు వెళ్ళి కూచున్నారు. తలయెత్తి ఒక్కొక్కరి వైపే పరిశీలనగా చూశాను. అందరూ దోషుల్లా తలలు ఫైళ్ళలో దూర్చేసి కూచు న్నారు.**

వాళ్ళకు తెలుసు, నాకు నవ్వంటే పెద్ద చిరాకని. నేను మెట్లెక్కుతున్నప్పుడు వాళ్ళందర్నీ పెద్దగా నవ్వుకోవడం నాకు వినిపించి వుంటుందని కూడా వాళ్ళకు తెలుసు.

నా సీట్లోకెళ్ళి కూచుంటున్నప్పుడు వినిపించింది "గుడ్ మార్నింగ్ సార్" అని. చివ్వున తలయెత్తి చూశాను. ఎదురుగా స్టెనో — నవ్వుతూ ... నాలో నరాలు తెగిపోయే కోపం, ఒక్కసారిగా గదంతా నిశ్శబ్దం. అందరిలో టెన్షన్. ఎంత ధైర్యం, నా ఎదురుగా నవ్వి రెండో రోజు ఆఫీస్‌లో కనిపించిన శాల్తీ ఎవరూ లేరు ఇప్పటివరకూ.

బాలాత్రిపుర సుందరిట. నిన్ననే జాయిన్ అయింది. అందుకే తెల్సివుండకపోవచ్చు. ఉరిమి చూశా నామె వైపు.

"ఐ డోంట్ లైక్ దీజ్ ఫార్మాలిటీస్. ఐ వాంట్ వర్క్" అన్నాను మొఖం చిట్లిస్తూ.

సుందరి మోహంలో నవ్వు మాయమైంది. ఆర్టిఫిషియల్ నవ్వులా హఠాత్తుగా ఆరిపోకుండా ఓ వెల్తురు ముక్కలా ఆ పెదవుల చివర్ల నుంచి వేలాడుతూనే వుంది.

"ఇడియట్" నాలో నేనే గొణుక్కున్నాను.

ఇంత పెద్ద ఆఫీస్‌కి మానేజర్ అంటే ఆషామాషీ కాదు. కత్తి మీద సాములాంటి ఉద్యోగం. సబార్డినేట్స్‌తో నవ్వుతూ మాట్లాడితే నెత్తికెక్కి కూచుంటారన్న విషయంలో ప్రగాఢ విశ్వాసం కలవాణ్ణి నేను.

నవ్వంటే అసహ్యం కలగడానికి మరో రెండు కారణాలున్నాయి. ఒకటి నా గతం. అడుగడుగునా కష్టాలూ, కన్నీళ్ళు భరించి, సహించి చివరికీ స్థితికి చేరుకున్నాను. జీవితంలోని కరకు నిజాలకూ నాకూ మధ్య జరిగిన సంగ్రామంలో "నవ్వు"ని జీవితం చంపేసింది. నాకు దూరమైన నవ్వు మరొకరి స్వంతం కావడం నేను భరించలేను. రెండో కారణం —

"సార్, పెద్దయ్య పిలుస్తున్నారు" ఎదురుగా ప్యూన్. చిరాగ్గా చూశాను వాడి వైపు. వాడు మరీ వంగి నిలబడ్డాడు. అతి వినయం. ఐ డోంట్ బిలీవ్ దీజ్ పీపుల్. ఆల్ ఛీట్స్.

స్ప్రింగ్ డోర్స్ తెరుచుకుని బాస్ రూంలో కెళ్ళాను. కొద్దిగా వంగి నిలబడ్డాను.

బాస్ ముఖం వికృతంగా పెట్టాడు. అసలే కురూపి. దానికితోడు ఇదొకటి. మరికొద్దిగా వంగి నిలబడ్డాను. నేను పంపిన ఫైల్ తెరిచి "వాటీజ్ దిస్ ఐ సే" అని ప్రారంభించాడు. ముఖంలో రౌద్ర, బీభత్స, భయానక రసాలన్నీ కనిపించాయి.

బైటికొచ్చి నిటారుగా నిలబడి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాను.

సాయంత్రం ఇంటికెళ్ళి గడపలోంచే "జానకీ" అని పిలిచాను గర్జించినట్లు. మృదువుగా మాట్లాడితే మరీ బరితెగించిపోతారు ఆడవాళ్ళు.

కోటు విప్పదీసి జానకి వైపు విసిరేశాను. ముఖం చిటపటలాడించుకుంటూ లోపలికి తీసుకెళ్ళింది. అసలే నలుపు. అలసి ఆఫీస్ నుంచి వచ్చిన భర్తని ఇలానేనా రిసీవ్ చేసుకునేది? ఇడియట్. నా నవ్వుని ఖూనీ చేసిన రెండో కారణం యిదే.

* * *

ఆఫీస్‌లోకి వెళ్ళగానే బాలాత్రిపురసుందరి నవ్వింది. గుడ్‌మార్నింగ్ అని మాత్రం అనలేదు. ఆ నవ్వు పలకరిస్తున్నట్లు, ఛీ ఛీ ... ఏమిటీ ఆలోచనలు .. పళ్ళు కొరుక్కుంటూ చూశాను. నవ్వు నిశ్శబ్దంగా ఆ విశాలమైన కళ్ళలో చేరి తళుక్కుమని మెరిసింది.

మూడో రోజు కూడా సుందరి నవ్వింది. అందంగా ... నేను కాలుపెట్టగానే ఆఫీస్‌లో పెల్లుబికే నిశ్శబ్ద తరంగాల మీద తేలియాడుతూ వచ్చే పూలనావలా ఆ నవ్వు ...

వారం గడిచింది. సుందరి పలకరింపుగా తన అద్భుతమూ, అతిసుందరమూ అయిన నవ్వుతో నన్ను పలకరిస్తూనే వుంది. ఆ నవ్వు వసంతంలా, వెన్నెల రాత్రిలా, మల్లెల సౌరభంలా ...

నెల గడిచింది.

ఆ రోజు నా సీట్‌లో కూచున్నాక గుర్తొచ్చింది. సుందరి నవ్వు నాకు స్వాగతం పలకలేదని. ఆమె సీట్ వైపు చూశాను. ఖాళీగా వుంది. అప్పుడు చూసుకున్నాను. నోట్ బుక్ మీద వున్న లీవ్‌లెటర్‌ని. పొందిగ్గా అమర్చబడిన అక్షరాల వరుస పలువరుసలా మనోహరంగా మెరిసి నవ్వును కురిపిస్తున్నట్లు ...

ఆ రోజంతా అసీజినెస్ ... భరించలేనంత అసీజినెస్ ... ఉక్కు చట్రంలో బిగించినట్లు —

* * *

పోగొట్టుకున్నదాన్ని రోజంతా - రాత్రంతా మేల్కొని వెతికి వెతికి ఉదయం దారెంట కళ్ళన్నీ పరిచి గాలించి హృదయంలోని అన్ని గవాక్షాలూ తెరిచి శోధించి చివరికి ఆఫీస్‌లో ఆ సీట్‌లో ఉదాత్తమైన మనసులోంచి ఉద్భవించిన ఆ నవ్వు చూశాక హమ్మయ్య, ఎంతటి ప్రశాంతత. నేనూ నవ్వాను పలకరింపుగా ... కళ్ళలో కాస్తంత తడి విడివడీ విడివడక.

నవ్వు నవ్వుని వెలిగిస్తుంది ... నవ్వు నవ్వుని బతికిస్తుంది.

శరీరం నిండా ఓ కొత్త వెల్తురు ప్రవహిస్తున్న అనుభూతి.

* * *

"సార్ - పెద్దయ్య పిలుస్తున్నారు" ఎదురుగా ప్యూన్.

పలకరింపుగా నవ్వి తల వూపాను వస్తున్నానన్నట్లు. వాడి కళ్ళలో గౌరవంతో కూడిన మెరుపు.

స్ప్రింగ్ డోర్స్ తెర్చుకుని లోపలికెళ్ళాను.

"గుడ్ మార్నింగ్ సార్" నాలో అద్భుతమైన రోజుని అనుభవించిన తృప్తి.

బాస్ కళ్ళలో ప్రశంసాపూర్వకమైన చిర్నవ్వు.

సాయంత్రం ఇంటి కెళ్ళాక "జానకీ" అని పిల్చాను మృదువుగా. ముఖం మాడ్చుకుంటూ వచ్చింది. కోటు విప్పదీసి మెల్లిగా చేతికిస్తూ "ఏవోయ్! అలసినట్లు కనిపిస్తున్నావ్. పని ఎక్కువైందా" నవ్వుతూ అడిగాను.

ఓసారి కళ్ళు విప్పార్చి ఆశ్చర్యంగా చూసింది జానకి. ఆ వెంటనే అఖండ జ్యోతిలా వెలిగే ముఖంతో - కుర్చీ దగ్గరకు లాక్కుని నాకు దగ్గరగా కూచుని అడిగింది "ఏమిటీ విశేషం!" అంటూ. అందులో అనంతమైన ఆప్యాయత, నేను పోగొట్టుకున్న అతి విలువైన అనురాగం.

*ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన మినీ కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.*

— ఎడిటర్

నాకు నచ్చిన కథ: ______________________

*రచయిత/ రచయిత్రి:* ______________________

*పేజీ నంబరు:* ______________________